# సింగిల్ పేజీ కథలు

**ఆరోజు ఒకటవ తేదీ.**

**ఉదయం 10 గంటలు.**

ఉద్యోగస్తుల జీతాలరోజు కావడంతో బ్యాంకు చాలా రద్దీగా ఉంది. బ్యాంక్‌స్టాఫ్ అప్పుడప్పుడే ఒక్కొక్కరుగా వచ్చి, వారి వారి సీట్లలో కూర్చుంటున్నారు. అప్పుడే లోనికి వచ్చిన రంగయ్య చుట్టూ పరికించి ఓ టేబుల్ దగ్గరికి వచ్చాడు. ఎదురుగా కూర్చున్న క్లర్క్‌తో ''అయ్యా! నా పేర ఖాతా తెరచి డబ్బులు ఎయ్యాలయ్యా'' అన్నాడు.

అప్పటికే బిజీగా పుస్తకంలో తలదూర్చివున్న క్లర్క్ తల పైకెత్తి చూశాడు. ఎదురుగా తలకు తుండుగుడ్డ చుట్టి, మాసిన చొక్కా, గళ్ళలుంగీతో ఉన్నాడు రంగయ్య.

''అకౌంట్ ఎందుకు ఓపెన్ చేయాలనుకొంటున్నావ్...డబ్బు దాచేందుకా?'' అడిగాడు క్లర్క్.

''కాదయ్యా..ఫైనాన్సులో ఆటో కొనాలి. ఆ ఆఫీసుకెళితే వాళ్ళు తక్కువ వడ్డీతో డబ్బు ఇస్తామన్రు. వారికి అదేదో చెక్కు బుక్కు మీద సంతకాలు చేసి ఇవ్వాలట కదయ్యా. అది కావాలంటే నా ఖాతా బ్యాంకులో ఉండాలట కదయ్యా..'' అని ఆగి ఆగి తడబడుతూ చెప్పాడు రంగయ్య.

''భలేవాడివయ్యా! ఎంత నింపాదిగా చెప్పినావే...చెక్‌బుక్ కావాలనీ! అదీ ఫైనాన్స్ వారికా..వీలుకాదు, వీలుకాదు!'' ముఖం చిట్లించి చెప్పి, పట్టించుకోనట్లు తన పనిలో తాను లీనమయ్యాడు క్లర్క్.

''ఈడ అడిగితే ఇస్తారన్నారయ్యా..మా అబ్బ పేర వున్న పొలం తాలూకు కాగితాలు కూడా ఫైనాన్సులో ఉంచినానండయ్యా. మీరు దయచేసి ఇప్పించండయ్యా. నేను టంచన్‌గా డబ్బు తెచ్చి కట్టేస్తానండయ్యా!'' బ్రతిమిలాడుతున్నట్లు చెప్పాడు రంగయ్య.

''నీవు డబ్బు కట్టాల్సింది ఇక్కడ కాదు, ఫైనాన్సు ఆఫీసులో! ఫైనాన్సు ఆఫీసు కిచ్చేందుకు చెక్ బుక్ ఇవ్వరు''


''ఇక నీవు వెళ్ళొచ్చు'' అన్నట్లు ఇబ్బందిగా ముఖం పెట్టి చెప్పాడు క్లర్క్.

దెబ్బతిన్న పక్షిలా బాధగా, ఏమీతోచక వచ్చిపోయేవారి ముఖాలు చూస్తూ ''ఇంకా ఫైనాన్స్ అయ్యగారు రాలేదే.. వస్తారో రారో'' అని మనసులో అనుకొంటూ ఫైనాన్స్ ఏజెంటు కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు రంగయ్య.

జనం రద్దీ రానురాను కొద్దిగా తగ్గింది. కొద్దిసేపటి తరువాత రాసుకొంటున్న లెడ్జర్ బుక్ పక్కన పెట్టి సముదాయిస్తున్నట్లుగా చెప్పాడు క్లర్క్.

''చూడు..ఫైనాన్స్ వాళ్ళు అప్పు ఇస్తూ, మీరు బ్యాంకు ద్వారా చెల్లించేటట్లు రాయించుకొని చెక్కులు తీసుకొంటారు. ఆపై ప్రతినెల మీరు బ్యాంకులో డబ్బు కట్టేస్తే..వాళ్ళు ఇక్కడ ఆ చెక్కులు ఇచ్చి డబ్బులు తీసుకుంటారు. ఆ

## తెలివి




రోజుకు నీవు బ్యాంకులో డబ్బు జమ చేయలేదనుకో అప్పుడు మాకు అంటే బ్యాంకుకు ఇబ్బంది వస్తుంది. అందుకని చెక్‌బుక్ ఫైనాన్సు వాళ్లకోసమైతే ఇవ్వము. దీనివల్ల బ్యాంకుకు ఏమాత్రం ప్రయోజనం ఉండదు''

క్లర్క్ చెప్పింది సగం అర్థమై సగం అర్థంకానట్లు ముఖం పెట్టాడు రంగయ్య.

సరిగ్గా ఓ పదినిమిషాల తరువాత ఫైనాన్స్ కంపెనీ ఏజెంటు బ్యాంకులోనికి రాగానే, సరాసరి రంగయ్య దగ్గరకు వచ్చి సైగ ద్వారా ప్రక్కకు తీసుకెళ్ళాడు.

అతనిని చూడగానే రంగయ్య ''నమస్తే...బాబుగారూ'' అన్నాడు.

''ఎంతసేపయింది వచ్చి?'' అడిగాడా వ్యక్తి.

''చాలాసేపయిందయ్యా''

''నిన్ను బైటే ఉండమన్నాను కదా..'' అని నసిగి కాస్త గొంతు తగ్గించి మళ్లీ చెప్పాడా వ్యక్తి.

''చూడు రంగయ్యా! మేనేజర్‌తో నేను మాట్లాడే మాటనుబట్టి నిన్ను అడిగితే 'అవును' అను, అంతేగానీ నీవేం మాట్లాడకు. ఏ వ్యాపారం చేస్తావని అడిగితే రొయ్యల గుంటలు ఉన్నాయని చెప్పు. అంతే!'' చెప్పాడా ఏజెంటు.

రంగయ్యకు తాను ఆటో కొనబోతూ రొయ్యల గుంటలు ఉన్నాయని ఎందుకు చెప్పాలో అర్థం కాలేదు. అయినా 'సరేనయ్యా' అంటూ తల ఊపాడు రంగయ్య.

ఏజెంటు ముందు, అతని వెనుక రంగయ్య..మేనేజర్ రూమ్ లోపలికెళ్ళారు.

వారెళ్ళగానే మేనేజర్‌కు నమస్కరించాడు ఆ ఏజెంటు. రంగయ్య కూడా చేతులు జోడించి పక్కన నిలబడ్డాడు.

తనను తాను ఏదో, ఇంగ్లీషులో పరిచయం చేసుకొని రంగయ్య గురించి చెప్పడం మొదలెట్టాడు.

''ఇతను భలే కష్టజీవండీ. ఓ పది ఎకరాల రొయ్యల గుంటలు వున్నాయి. మీ బ్యాంకుకు మంచి ఖాతాదారుడు కాగలడు. ఎంతైనా నెలకు ఓ లక్షరూపాయల వరకూ లావాదేవీల్లో దొర్లుతాయి'' అంటూ ఇంగ్లీషులో ఇంకేమేమో చెప్పాడు ఆ ఏజెంటు, మేనేజర్‌తో.

మేనేజర్ వాళ్ళను కూర్చోబెట్టి నిమిషాల్లో ఫారాలు పూర్తి చేసి ఫోటోలు అతికించి..పని పూర్తిచేశాడు. కాకుంటే రంగయ్యే సంతకాలు పెట్టేందుకు కొంత టైం తీసుకొన్నాడు.

మేనేజర్ స్వయంగా థ్యాంక్స్ చెబుతూ చెక్ బుక్ వీళ్ళ చేతుల్లో పెట్టాడు. చెక్‌బుక్ తీసుకొని ఆనందంగా బయట పడ్డారిద్దరూ.

గంటల తరబడి బ్రతిమాలుకున్నా జరగని పని క్షణాల్లో ఏజెంట్ పూర్తిచేసిన వైనం చూసి..అప్పటికీ సంధిగ్ధంగా..రెండుసార్లు ఆ చెక్ బుక్‌ను తేరిపార అటూ ఇటూ మళ్ళించి చూసుకున్నాడు రంగయ్య.

ఫైనాన్స్ ఆఫీసుకొచ్చి ఒక్కొక్కటిగా రాత్రిబడిలో నేర్చుకున్న సంతకాలు పెడుతూ, తన అనుమానాన్ని వెలిబుచ్చాడు రంగయ్య.

''అయ్యా! రొయ్యల గుంటల యాపారం అని చెప్తే చెక్కుల పుస్తకం ఇచ్చారు కదా? ఫైనాన్స్ ఆఫీసుకంటే ఎందుకు ఇవ్వలేదయ్యా?'' అడిగాడు.

''ఏంలేదు రంగయ్యా! ఫైనాన్స్ వాళ్ళకు చెక్కులు ఇచ్చి డబ్బు కట్టలేని పరిస్థితుల్లో చాలా

చిక్కులు వున్నాయి. అందుకే చెక్కులు ఫైనాన్స్ కంటే ఇవ్వరు'' చిరునవ్వుతో చెప్పాడు ఏజెంటు.

''నేను డబ్బు ఆపకుండా కడ్తాను అని సెప్పాను కదయ్యా''

''నీవు చెప్పేది నిజమే! కాని 'నిజం' అన్న గ్యారెంటీ ఏమిటి? ఈ కాలంలో ఎవడు మంచోడో, ఎవడు చెడ్డోడో తెలియడం లేదు. మనం 'నిజం' చెప్తే దానిని ఇతరులు 'అబద్ధం' అనుకోవడం ఎంత సమంజసమో, 'అబద్ధం' చెప్పినప్పుడు దానిని 'నిజం' అనుకోవడం అంతే సహజం. అందుకే ఈ కాలంలో మోసం చేసేవాడు తేలికగానే బాగుపడ్తున్నాడు. నష్టపోయేది, నిజం చెప్పి ధర్మంగా నడవాలనుకున్నవాడే కదా! ఇదంతా ఎందుకొచ్చిన గొడవ అని బ్యాంకులేమో, చెక్కులు ఇవ్వకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఎంత జాగ్రత్తపడ్డా తెలివుంటే మార్గాలు అనేకం.. ఏమంటావ్?'' అన్నాడు గర్వంగా.

కథ ఇక్కడివరకు అర్థమైన రంగయ్యకు ఒక్క విషయం మాత్రం అర్థం కాలేదు.

ఈ మాయదారి డబ్బున్న గొప్పోళ్ళు మాటలు నేర్చి తెలివి మీరాక ఇలా గొప్పోళ్ళయ్యారా...లేక డబ్బు వచ్చి గొప్పోళ్లయ్యాక మాటలు నేర్చారా! అన్నది అర్థంకాక ఆలోచిస్తూ ఉండిపోయాడు రంగయ్య.

**-రోషన్ మొగల్ (నెల్లూరు)**

# నిజాయితీ

ఎదురింటి మీనాక్షమ్మకి నేనంటే కొంచెం కోపం. కారణం పెద్దగా ఏమీలేదు. నేను ఉద్యోగం చేస్తూండటం వల్ల రోజూ పొద్దున్న తొమ్మిది గంటలకల్లా తయారయి ఆఫీసుకు వెళ్ళటం, మళ్ళీ సాయంత్రం ఆరు గంటలదాకా రాకపోవటం, అప్పటికే నేను అలసిపోయి వుండటం, మళ్ళీ ఇంట్లో పనులు ఎదురుచూస్తూ వుండటంతో ఆవిడ వాకిట్లోనే పలకరించినా నేను ముక్తసరిగా మాట్లాడి ఇంట్లోకొచ్చేస్తాను. అంతే.


మాది కొత్తకాలనీ. మా వీధిలో ఎక్కువ ఇళ్ళు లేవు. అందుకే మీనాక్షమ్మగారిలాంటి కబుర్ల పోగులకు కాలక్షేపం కావటం కష్టం. కబుర్లు చెప్పకపోతే కడుపంతా దేవేసినట్లు నానా బాధాపడిపోతుంది ఆవిడ. ఎక్కడెక్కడి కబుర్లో కామా, ఫుల్‌స్టాప్ లేకుండా ఎదుటివాళ్ళను ఆకట్టుకునేటట్లు చెప్పే నేర్పరి.

నేనెంత కాదనుకున్నా అప్పుడప్పుడన్నా నా మనసు ఆవిడ కబుర్ల వైపు ఆకర్షింపబడుతుంది. అలాంటి సమయాల్లో ఈమధ్య ఆవిడ కబుర్లలో తరచూ వస్తున్న టాపిక్, దొంగతనాలు.

"ఈమధ్య కాలనీలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. దొంగలు పగటిపూట కూడా కాలనీలో రకరకాల వేషాల్లో తిరుగుతున్నారుట. సరుకులమ్ముకునేవాళ్ళు, కాయితాలేరుకునేవాళ్ళు, బిచ్చగాళ్ళు. అమ్మో ఎవర్నీ నమ్మటానికి లేదు" గోరంతలు కొండంతలు చేస్తోందా అనిపించింది.

"మీరేమో ఇంట్లోనే వుండరు. ఉన్నా, లోపలేం చేస్తుంటారో ఏమో కాని వీధి మొహం చూడరు. మన వీధిలో ఈమధ్య ఎవరెవరో కొత్తవాళ్ళు తిరుగుతున్నారు. పగలంతా నేనొక్కదాన్ని...భయం వేస్తూంటుంది" సమాచారంతోపాటు తన అక్కసు కూడా వెళ్ళగక్కింది మీనాక్షమ్మ ఒకరోజు.

"అయినా మధ్య మధ్యలో వాకిట్లోక్కూడా చూస్తూం



డాలి, వీధిలోకి కొత్తవాళ్ళెవరన్నా వస్తున్నారేమోనని."

మీనాక్షమ్మగారి మాటలు నిజమేననిపించింది. ఈరోజుల్లో కొత్తవాళ్ళ మీద ఒక కన్నేసి వుండటం అవసరమేననిపించింది. అందుకే ఈమధ్య ఇంట్లో వున్నప్పుడు మధ్య మధ్యలో వీధిలోకి తొంగి చూస్తున్నా.

ఇవాళ..సరిగ్గా అలా చూసినప్పుడే ఆ పిల్లాణ్ణి చూశాను. పదేళ్ళుంటయ్యేమో. ఇంటిముందున్న కారు కిందనుంచి ఏదో లాగుతూ కనిపించాడు.

'దొంగపిల్లాడేమో' అనుమానం. ఇంట్లోను, వీధిలోనూ కూడా ఎవరూ లేరు. వీధిలో మాత్రం 'గిన్నెలకు మాట్లేస్తాం, కళాయి పెడతాం' అని అరుచుకుంటూ ఒక ఆడ, మగ వెళ్తున్నారు.

బహుశా వీడుకూడా వాళ్ళ తాలూకాయేనేమో! ఏం తీస్తున్నాడో చూద్దామని అక్కడే ఆగాను. 'అయినా కారు కిందేముంటుంది చెత్త తప్ప. కొంపతీసి ఏ టెర్రరిస్టు తరపునో బాంబేమన్నా పెడుతున్నాడా' నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది. అయినా చూద్దామని వాడికి కనబడకుండా నుంచున్నాను.

ఆ పిల్లాడు కారు కిందనుంచి ఒక చెప్పు తీశాడు. కొత్తదానిలాగే వుంది. పెద్దవాళ్ళదే. ఎవరిదోమరి. ఆ పిల్లాడు చెప్పుతీసుకుని ముందు వెళ్తున్నవాళ్ళ వెనకాల చెప్పుల్లేని కాళ్ళతో పరిగెత్తుతూనే "అయ్యా..అయ్యా.. చెప్పు..ఒకటే వుంది. రెండోది లేదు. చూసొస్తాను. ఆగయ్యా" అమాయక పసిహృదయం ఆగి ఆ చెప్పు కాలికి వేసుకుని సరదాపడుతోంది.

ఎండలో కాలికి చెప్పులన్నా లేకుండా పొట్టకూటికోసం వీధి వీధీ తిరుగుతున్న పసితనాన్ని చూసి నాగుండె నిట్టూర్చబోతుండగానే వాళ్ళ నాన్న అన్నాడు.

"అరేయ్, ఎన్నిసార్లు చెప్పాల్రా నీకు. అట్టా ఏం తేవద్దని!"

"నేనెవర్ది తేలేదయ్యా. అగో ఆ కారు దగ్గర పడుంది" కారు వైపు చూపిస్తూ చెప్పుని కాలుతో పక్కకి నెట్టాడా పిల్లాడు.

"ఈడ కాదు. ఆడే పడేసిరా పో. అట్టా ఏం తేవద్దు. కష్టపడాల. తినాల" కొడుక్కి చెప్పేసి-

"మాటేస్తామమ్మా మాట్లు..గిన్నెలకి కళాయి పెడతాం" డ్యూటీలో దిగిపోయాడా తండ్రి.

తండ్రి మాటలకి మొహం చిన్నబుచ్చుకున్నా, ఆ చెప్పు తీసుకొచ్చి ఎక్కడనుంచి తీశాడో అక్కడే పడేసి తండ్రి వెనకే పరిగెత్తాడా పిల్లాడు.

ఆ నిజాయితీని చూసి ఆశ్చర్యపోయాను. గొప్ప పుట్టుకలు, కుటుంబ గౌరవాలు, కార్లు, మేడలూ లేకపోవచ్చు. వాళ్ళకే తెలియకుండా కష్టపడి బతికే బతుక్కే ఒక అర్థం కల్పించుకున్నారు వాళ్ళు.

మనసంతా ఒకవిధమైన సంతోషంతో, సంతృప్తితో నిండిపోయింది. అప్రయత్నంగా దేవుణ్ణి ప్రార్థించాను.

"దేవుడా, వాళ్ళని కాపాడు."

**-పి.యస్.యమ్.లక్ష్మి (హైదరాబాద్)**

## ఆర్.ఎస్.కృష్ణమూర్తి కథల పోటీ

ప్రముఖ తెలుగు కథా రచయిత ఆర్.ఎస్.కృష్ణమూర్తి పేరిట ప్రతి ఏటా నిర్వహిస్తున్న సంక్షిప్తకథల పోటీకి కథా రచయిత(త్రు)ల నుంచి ఎంట్రీలని ఆహ్వానిస్తున్నారు. జీవన వైవిధ్యానికి అద్దం పట్టేలా 20 పేజీలకి మించని కథల్ని పోటీకి పంపించాలి. ఒక రచయిత ఒక్క కథని మాత్రమే పోటీకి పంపించాలని నిర్వాహకులు ఆర్.ఉదయ్‌భాస్కర్ తెలియజేశారు. రచయిత(త్రు)లు పంపే కథలు ఇంతకుముందు ఏ పత్రికలోనూ ప్రచురితమైనవి కానీ, టీవీ/రేడియోల్లో ప్రసారం అయి ఉండకూడదు. పోటీకి పంపిన కథల్లో ఉత్తమమైనవాటిని ప్రముఖ రచయితల జ్యూరీ అవార్డులకి ఎంపికచేస్తుంది. మొదటి ఉత్తమ కథకు 3000రూపాయలు, రెండవ ఉత్తమ కథకు 2000రూపాయలు, తృతీయ ఉత్తమ కథకు 1000రూపాయలు నగదు బహుమతిగా అందజేస్తారు. ఆర్.ఎస్.కృష్ణమూర్తి జయంతి రోజైన జూన్ 6, 2003న ఈ బహుమతుల్ని అందజేస్తారు. పోటీకి పంపే రచనల్ని ఎన్.ఎస్.మూర్తి, 4-49, నాయుడుతోట బస్టాప్, వేపగుంట పోస్ట్, విశాఖపట్నం-47 చిరునామాకి మార్చి 31, 2003లోగా అందేటట్లు పంపించాలి.